# 5

# దావీదు కుమారుడు/దేవుని కుమారుడు

## (2 సమూయేలు 7:1-17)

అది పెద్ద ఊరైనా, చిన్న ఊరైనా ప్రతి ఊరిలోను "గ్రుడ్డి బర్తిమయి" వంటివారు ఒకరు తప్పనిసరిగా ఉంటారు. యేసును కలుసుకున్న ఇతడిని మార్కు 10:46–52లో చూస్తాము. జన సమ్మర్దం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో వీరు ఉంటారు, కానీ ప్రజలెవరూ వీరిని గురించి పట్టించుకోరు.

బర్తిమయి ఎంత కాలంనుండి గ్రుడ్డివానిగా ఉంటున్నాడో మనకు తెలియదు. రోడ్డు ప్రక్కన ఎంత కాలంనుండి ఉంటున్నాడో కూడా మనకు తెలియదు కానీ నజరేతువాడైన యేసు ఆ దారిన వెళ్తున్న సమయంలో సరైన సమయానికి, సరైన స్థలంలో అతడున్నాడు. యేసును గురించి, ఆయన గ్రుడ్డివారికి చూపునిస్తున్నవాడన్న విషయాన్ని విని ఈ అవకాశాన్ని పోగొట్టుకోకూడదని అతడు నిర్ణయించుకున్నాడు. అతడు "కేకలు వేయ మొదలుపెట్టెను" మార్కు 10:47. అతడు ఒక్కసారి మాత్రమే అరవలేదు గాని "దావీదు కుమారుడా యేసూ, నన్ను కరుణింపుమని" మాటిమాటికి కేకలు వేస్తూనే ఉన్నాడు. ఒక అనామకుడు చేస్తున్న ఈ గోల విని, వారి ప్రక్కనున్న కొంతమంది అతడిని ఊరకుండమని గద్దించారు. కానీ, "దావీదు కుమారుడా, నన్ను కరుణింపుమని" మరి ఎక్కువగా కేకలు వేసినట్లు మార్కు కథనంలో చూస్తున్నాము (48 వచనం). అతని సహవాసానికి, పట్టుదలకు ఫలం దొరికింది. "వానిని పిలువుడని" యేసు ప్రక్కనున్న వారికి చెప్పారు. అప్పుడు వారు "ధైర్యము తెచ్చుకొనుము, ఆయన నిన్ను పిలుచుచున్నాడు, లెమ్ము" అని వానితో అన్నారు. బర్తిమయి లోబడ్డాడు. యేసు అతనిని స్వస్థపరిచాడు.

బర్తిమయి కథ ఎంతో ఆసక్తికరముగా ఉంటుంది. అయితే ఇది ఒక ప్రశ్నను రేకెత్తిస్తుంది: బర్తిమయి యేసును "దావీదు కుమారుడా" అని ఎందుకు పిలిచాడు? యేసునకు ఉన్న అనేక పేర్లు అయిన "దేవుని కుమారుడు," "ప్రభువు," "బోధకుడు" లేక యేసు తనను తాను పిలుచుకునే – "మనుష్య కుమారుడు" అని ఎందుకు పిలువలేదు? గ్రుడ్డివానిని స్వస్థపరచుటలో దావీదు సంతతివానిగా యేసు వారసత్వం ఎలాంటి పాత్రను పోషించింది?

### వాగ్దానము

**దావీదు నిమిత్తం ఒక "నివాసమును" కట్టింతును!**

ఇది జరగడానికి వెయ్యి సంవత్సరముల ముందు రాజైన దావీదు యిచ్చిన వాగ్దానమునకు వెళ్ళదాము. 2 సమూయేలు 7:1–17లో ఇది వ్రాయబడింది. ఇశ్రాయేలునకు రాజుగా దావీదు తన పాలనయందు సమున్నత స్థానమునకు చేరుకున్నాడు. అతడు కాపురముండుటకు మంచి ఏర్పాటును చేసుకున్నాడు (గుడారములు లేదా కుటీరములలో గాక), "యెహోవా నలుదిక్కుల అతని శత్రువులమీద అతనికి విజయమిచ్చి అతనికి నెమ్మది కలుగజేశాడు" (1ది

వచనం). అయితే ఒకటి మాత్రం దావీదునకు నెమ్మది నియ్యలేదు. దీన్నే అతడు ప్రవక్తయైన నాతానుతో చెప్పాడు: "నేను దేవదారుమ్రానుతో కట్టిన నగరియందు వాసము చేయుచుండగా దేవుని మందసము డేరాలో నిలిచియున్నది" (2 వచనం). ఐగుప్తీయుల చెరనుండి ఇశ్రాయేలీయులు విడిపింపబడిన తరవాత పరిశుద్ధ మందసము అప్పటినుండి డేరాలో లేదా ప్రత్యక్ష గుడారములోనే ఉంటుండగా, తాను మాత్రం మంచి ఇంటిలో ఉండడం దావీదు మనసును నొప్పించింది. "దేవుని కొరకు ఒక ఇంటిని నిర్మించాలని" దావీదు భావిస్తున్నట్లు వాక్యములో స్పష్టముగా లేకపోయినను మందసము కొరకు ఒక ఆలయమును నిర్మించుట దావీదు మనసులోనున్నదని మనకు కనబడుతుంది. అతడు దేవుని ఘనపరచాలనుకున్నాడు. సమయం కూడా సరిగ్గా కలిసి వచ్చింది. అతడి ఆలోచనలను బట్టి "యెహోవా నీకు తోడుగానున్నాడు" అని నాతాను ధైర్యపరిచాడు. దావీదుకు సమాచారమిచ్చుటకు దేవుడు రాత్రివేళయందు దర్శనం ద్వారా నాతానుతో మాట్లాడాడు:

> – నీవు పోయి నా సేవకుడగు దావీదుతో ఇట్లనుము – యెహోవా నీకాజ్ఞ యిచ్చునదేమనగా – నాకు నివాసముగా ఒక మందిరమును కట్టింతువా? ఐగుప్తులోనుండి నేను ఇశ్రాయేలీయులను రప్పించిన నాటనుండి నేటివరకు మందిరములో నివసింపక డేరాలోను గుడారములోను నివసించుచు సంచరించితిని. ఇశ్రాయేలీయులతో కూడ నేను సంచరించిన కాలమంతయు నా జనులను పోషించుడని నేను ఆజ్ఞాపించిన ఇశ్రాయేలీయుల గోత్రములలో ఎవరితోనైనను దేవదారుమయమైన మందిరమొకటి మీరు నాకు కట్టింపకపోతిరే అని నేనెన్నడైనను అనియుంటినా? (2 సమూయేలు 7:5-7).

ఇక్కడ దేవుని సందేశం స్పష్టంగా ఉంది: దేవునికి మందిరము అవసరంలేదు. అలా కావాలని ఆయన ఎప్పుడూ ఎవరిని అడుగలేదు. ఒకవేళ దేవాలయం ఒకటి కావాలనుకుంటే అందుకు దానిని కట్టుటకు దావీదే అవసరమై ఉండేది కాదు. దావీదుకున్న ఆశ చాలామంచిది కానీ అది కొంతవరకు అనుమానాస్పదమైనది. దావీదు గొప్ప రాజు కానీ దేవుడు దేవుడే. దావీదు తన కొరకు "మంచి చేసిపెట్టాలని" ఆయన అనుకోవడం లేదు.

ఆశీర్వాదమును కలుగజేయువాడను నేనే అని దేవుడు దావీదునకు 8 నుండి 11 వచనాలలో తెలియజేశాడు. ఆయన గొఱ్ఱెలు మేపుకునే దావీదును ఇశ్రాయేలురాజుగా నియమించినవాడు దావీదు శత్రువులందరిని నిర్మూలము చేసి, తన ప్రజలు విశ్రాంతి నొందునట్లు, శత్రువుల బాధనుండి విముక్తున్ని చేసింది ఆయనే.

*"యెహోవానగు నేను నీకు తెలియజేయునదేమనగా. నేను నీకు సంతానము (గృహమును) కలుగజేయుదును"* అని 11వ వచనంలో దేవుని అద్భుత వాగ్దానమును చూస్తున్నాము (నొక్కి చెప్పింది నాది). దావీదు తనకు ఒక గృహమును నిర్మించుట కాకుండా దేవుడే దావీదునకు ఒక గృహమును నిర్మిస్తానని వాగ్దానము చేస్తున్నాడు. తరువాత వచనాలను గమనిస్తే, దేవుడు ఒక కట్టడము గురించి చెప్పడం లేదని అర్థమవుతుంది. దావీదు తరువాత, ఆయన రాజ సంతతినుండి దేవుడు ఒక సంతానమును, దావీదు తరువాత స్థానములో నిలుపుతానని వాగ్దానం చేస్తున్నాడు. ఇక్కడ "గృహం" (ఆది ప్రతులలో గృహం అనుమాట సంతానమునకు బదులుగా వాడబడింది) అనే మాట నిజానికి "వంశము" గురించి మాట్లాడుతుంది. ఉదాహరణకు బ్రిటీషువారు "విండ్సర్ వంశం" ("the House of Windsor"). "దావీదు వంశమును" నిలువబెడతానని దేవుడు వాగ్దానం చేస్తున్నాడు.

**దావీదు సింహాసనమును నిరంతరము స్థాపించుటకు!**

2 సమూయేలు 7:12-16: (1) దావీదు స్థానంలో పరిపాలన చేయుటకు కుమారుని వాగ్దానం; (2) దావీదు గాక - ఆ కుమారుడే - దేవుని మహిమకొరకు ఒక మందిరమును నిర్మిస్తాడు, ముఖ్యముగా, (3) అతని రాజ్య సింహాసనమును దేవుడు నిత్యముగా స్థిరపరుస్తాడు ఈ వాగ్దానములతోపాటు దావీదు కుమారునికి దేవుడు తండ్రిగా ఉంటాడని వాగ్దానం చేసాడు. ఒకవేళ అతడు పాపము చేసినా గాని దేవుడతనిని శిక్షిస్తాడు గాని, రాజు అయిన సౌలునకు తన కృపను దూరంచేసినట్లు దావీదు సంతానమునకు తన కృపను మాత్రం దూరం చేయడు (1 సమూయేలు 15). *"నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును. నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును"* (1 సమూయేలు 7:16; నొక్కి చెప్పింది నాది) అని దేవుడు వాగ్దానం చేశాడు. దావీదు స్థానంలోనున్న మరెవరికైనా ఇంతకంటే మంచి వాగ్దానం వచ్చియుండేది కాదేమో! ఇశ్రాయేలు నెమ్మది పొందుతుందని, ఆ రాజ్యము స్థిరపరచబడుతుందని దేవుడు నిశ్చయతనిచ్చాడు. దేవుని తరస్కారమును ఆయన ఆశీర్వాదము రెండింటిని దావీదు విధేయతతో అంగీకరించి కృతజ్ఞతతో ఆయన సన్నిధినినున్నట్లు 2 సమూయేలు 7:18-29లో చూస్తున్నాము.

దేవుడు దావీదునకు చేసిన వాగ్దానములను మరింత నిశ్చితముగా పరిశీలించుదాము. పాత నిబంధనలోని అనేక ప్రవచనములవలె ఈ వాక్యమునకు కూడా రెండు విధాల నెరవేర్పులున్నాయి. ఒకటి త్వరలోనే నెరవేరబోతుండగా, మరొకటి కొంచెం కాలము తరువాత జరుగు నెరవేర్పును సూచిస్తుంది. (త్వరలోనే నెరవేరిన నెరవేర్పు) దావీదు కుమారుడైన సొలొమోను మందిరమును నిర్మించుటను గురించి (1 రాజులు 5-8). సొలొమోను పరిపాలనను దేవుడు అమితంగా ఆశీర్వదించాడు. తనకున్న అన్యదేశపు భార్యల వలన సొలొమోను విగ్రహారాధనను జరిగించినప్పుడు దేవుడు, తాను 14వ వచనంలో వాగ్దానం చేసినట్లుగానే సొలొమోనును శిక్షించాడు (1 రాజులు 11). ఈ వాగ్దాముల నెరవేర్పు సొలొమోను పరిపాలన ద్వారా మరియు దేవుని జోక్యంద్వారా ఎలాగు నెరవేర్చబడ్డాయో తెలుసుకోవడం కష్టం కాదు.

"దావీదు యొక్క సింహాసనము నిరంతరము స్థాపించబడును" అన్న వాగ్దానం సొలొమోను ద్వారా నెరవేర్చబడిందని చెప్పడం కష్టమే. నిజానికి, పాతనిబంధన ఈ విషయాన్ని కొట్టివేస్తుంది. సొలొమోను తరువాత రాజ్యము రెండుగా విభాగింపబడింది. దక్షిణ రాజ్యమైన యూదాలోనే దావీదు వంశ పాలన కొనసాగింది. ఆఖరికి ఈ రాజ్యం కూడా దేవునికి అవిధేయత కనబరచిన రాజుల చేత మరియు బబులోనువారి దురాక్రమణచే నాశనం చేయబడింది. దావీదు వంశపు రాజపాలన తాత్కాలికంగా మూసివేయబడింది. కాబట్టి 2 సమూయేలు 7:13, 16లోని, "నిత్యము" అను మాట సొలొమోను కాక మరొకరిని సూచిస్తుంది.

## వాగ్దానములోని మెస్సీయాను గూర్చిన నిరీక్షణ

**మెస్సీయాను గురించిన నిరీక్షణ**

2 సమూయేలు 7లో దేవుడు దావీదునకు యిచ్చిన వాగ్దానం, తనను విడిపించుటకు

మెస్సీయ అనే రాజు వస్తాడన్న ఇశ్రాయేలీయుల నిరీక్షణకు ఇది ఆధారమయింది. శత్రువులు ఇశ్రాయేలీయులను ఓడించినందున విమోచకుని గురించిన వారి నిరీక్షణ మరింత అధికమయింది. ప్రత్యేకించి బబులోను దండయాత్ర తరువాత, రాజరికపు వ్యవస్థ రద్దయిన తరువాత "మొదటనుండినట్లు స్థాపించబడుటకు" విమోచకుని కొరకు వారి ఆశ మరింత అధికమైంది (యిర్మీయా 33:7). వారి రాజకీయ మరియు మత వ్యవహారాలలో ఇది మరింత ఎక్కువయింది.

ఈ వాగ్దానాన్ని ఆధారం చేసుకుని, యూదులు మెస్సీయాను "క్రొత్త దావీదు" వలె ఆశించారు. దావీదు వలె ఇతడు పోరాటం ద్వారా ఇశ్రాయేలునకు శత్రువులనుండి నెమ్మదిని అనుగ్రహిస్తాడని వారి ఆశ. ఆ మెస్సీయ "దావీదు కుమారుడై" నిరంతరము పాలించువాడు. ఆ నిరీక్షణ పాత నిబంధనలోని అనేక వాక్యముల ద్వారా స్పష్టమైంది:

> యెహోవా ఈలాగు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు – రాబోవు దినములలో నేను దావీదునకు నీతి చిగురును పుట్టించెదను అతడు రాజై పరిపాలన చేయును, అతడు వివేకముగా నడుచుకొనుచు కార్యము జరిగించును, భూమిమీద నీతి న్యాయములను జరిగించును. అతని దినములలో యూదా రక్షణనొందును ఇశ్రాయేలును నిర్భయముగా నివసించును, యెహోవా మనకు నీతియని అతనికి పేరు పెట్టుదురు (యిర్మీయా 23:5, 6).

> సైన్యములకధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు – నీకున్న కాడి నీ మెడ నుండకుండ ఆ దినమున నేను దాని విరిచి నీ కట్లను తెంపెదను; ఇకను అన్యులు యాకోబు సంతతివారిచేత దాస్యము చేయించుకొనరు గాని వారు తమ దేవుడైన యెహోవా నగు నేను వారిమీద రాజుగా నియమించు దావీదును సేవించుదురు (యిర్మీయా 30:8, 9).

> ఏలయనగా మనకు శిశువు పుట్టెను,
> మనకు కుమారుడు అనుగ్రహింపబడెను.
> ఆయన భుజముమీద రాజ్యభారముండును.
> ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు
> నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతి అని
>     అతనికి పేరు పెట్టబడును.
> ఇది మొదలుకొని మితి లేకుండ దానికి వృద్ధియు క్షేమ
>     మును కలుగునట్లు
> సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును
>     నియమించును.
> న్యాయమువలను నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు
> అతడు సింహాసనాసీనుడై రాజ్యపరిపాలన చేయును.
> సైన్యములకధిపతియగు యెహోవా ఆసక్తికలిగి
>     దీనిని నెరవేర్చును (యెషయా 9:6, 7).

> నా సేవకుడైన దావీదు వారికి రాజవును, వారికందరికి కాపరి యొక్కడే యుండును, వారు నా విధులను అనుసరింతురు, నా కట్టడలను గైకొని ఆచరింతురు. మీ పితరులు నివసించునట్లు నా సేవకుడైన యాకోబునకు నేనిచ్చిన దేశములో వారు నివసింతురు, వారి పిల్లలును వారి పిల్లల పిల్లలును అక్కడ నిత్యము నివసింతురు, నా సేవకుడైన దావీదు ఎల్లకాలము వారికి అధిపతియై యుండును (యెహెజ్కేలు 37:24, 25).

మెస్సీయాను “రెండవ దావీదు” అని ఎందుకు పిలిచారు? “రెండవ మోషే,” “నూతన అబ్రాహాము” లేదా నోవహు, దానియేలు అని ఎందుకు పిలువబడలేదు? ఇందుకు గల ప్రాథమిక కారణం, దేవుడు దావీదునకు వాగ్దానం చేయడమే. అలాగే, దావీదు జీవితంలోని అనేక సంఘటనలు యేసు అనుభవించబోయే అనేక అనుభవాలను సూచిస్తున్నాయి. దావీదు కాపరి మరియు రాజు. యేసు క్రీస్తు కూడా తనను అనుసరించువారికి కాపరి మరియు రాజుగానున్నాడని క్రొత్త నిబంధన తెలియజేస్తుంది (ఉదాహరణకు, చూడు, మత్తయి 2:2; 27:37; యోహాను 10:11–18; 1 పేతురు 5:1–4; ప్రకటన 17:14; 19:16). అంతేగాక, దావీదు శ్రమలు కూడా యేసుని శ్రమలకు ముంగుర్తులుగానున్నాయి. ఇశ్రాయేలునకు అతి ప్రియమైన రాజుగా నగుటకు ముందు అతడు రాజైన సౌలు చేత తరుమబడ్డాడు (చూడు 1 సమూయేలు 18:28, 29). కొన్ని సంవత్సరముల తరువాత, దావీదు తన సొంత కుమారుడు అబ్షాలోము చేతనే తరుమబడ్డాడు. అతడు ప్రజల మన్ననలు పొంది తన తండ్రినే ఎదిరించాడు (2 సమూయేలు 15:10–12). ఈ రెండు సంఘటనలతోను, దావీదు పారిపోయి తన ప్రాణమును దక్కించుకోవాల్సివచ్చింది (1 సమూయేలు 19:10–12; 2 సమూయేలు 15:14; చూడు కీర్తనలు 54). దావీదు శ్రమలు మరియు మన ప్రభుని శ్రమల యొక్క సారూప్యత కీర్తన 22లో స్పష్టంగా కనబడుతుంది. యేసు ప్రభువు సిలువలో శ్రమ పడుతున్నప్పుడు ఇందులోని మొదటి వచనమునే ప్రభువు ఉదహరించారు. ఈ కీర్తన యొక్క భావములకు మరియు యేసు ప్రభుని అనుభవాలకు మధ్య ఎంతో సారూప్యత ఉంది – దేవుని చేత విడువబడడం, చుట్టు ప్రక్కనున్న వారిచేత దూషణ నెదుర్కోవడం, బలహీనుడై పోవడం మరియు తన వస్త్రము కొరకు చీట్లువేయడం వంటివి.

## నెరవేరిన మెస్సీయాను గూర్చిన నిరీక్షణ

నూతన నిబంధన గ్రంథకర్తలు యేసుని “దావీదు కుమారునిగా” స్పష్టముగా పేర్కొన్నారు. గ్రుడ్డివాడైన బర్తిమయి దీనిని స్పష్టముగా గుర్తించాడు. ఇందుకనే యేసు ప్రభువు తరచుగా “క్రీస్తు” (*christos*, మెస్సీయాకు సమానమైన అర్థము) అని పిలువబడ్డాడు. దీనికి “అభిషిక్తుడు” అని అర్థం.

యేసుని మెస్సీయా/రాజరికము అనేక విధములుగా వ్యక్తం చేయబడింది. ఉదాహరణకు ఇశ్రాయేలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మెస్సీయాగా క్రీస్తును చూపించడమే మత్తయి సువార్త యొక్క ఉద్దేశము. ఇది సువార్త ప్రారంభంలోనే స్పష్టమవుతుంది. “అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడైన యేసు క్రీస్తు వంశావళి.” యేసును క్రీస్తు (మెస్సీయా)గా మరియు దావీదు కుమారునిగా గుర్తించారు (యూదా చదువరులు ఈ విషయాన్ని బట్టి 2 సమూయేలు 7 మరియు తరువాత వాగ్దానములను గుర్తు చేసుకుంటారు). తరువాత ఆయన దావీదు సంతానపు వాడేనని నిరూపించుటకు దావీదు వంశావళి ఇయ్యబడింది. యేసు నజరేతులో గాకుండా బేత్లెహేములో జన్మించినట్లు లూకా 2:4, 5 తెలియజేస్తున్నాయి. ఎందుకంటే యోసేపు “దావీదు సంతతివాడు” జన సంఖ్యలో తన పేరు వ్రాయబడుటకు, తన వంశమును నమోదు చేయబడుటకు అతడు బేత్లెహేము చేరుకోవలసివచ్చింది. ఇది చరిత్రలో అనుకోకుండా జరిగినది కాదు. “దావీదు పట్టణమైన” బేత్లెహేములో యేసు పుట్టాలి.

యోహాను తన సువార్తలో దీన్నే లక్ష్యంగా చేసుకున్నాడు “యేసు దేవుని కుమారుడైన

క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30, 31). "నేను ఎవడనని మీరు చెప్పుకొనుచున్నారని" యేసు తన శిష్యులను అడిగినప్పుడు, "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" పేతురు సమాధానమిచ్చాడు. ఆ మాటలకు ఆయన పేతురును మెచ్చుకుని, పరలోకమందున్న తండ్రి ఈ సంగతిని పేతురునకు బయలుపరచాడని అన్నాడు (మత్తయి 16:15-17). క్రొత్త నిబంధన చివరిలో కూడ "రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు" ప్రకటన 19:16 అని యేసును గురించి ప్రకటించబడింది. ఆయన ఇశ్రాయేలునకు మాత్రమే గాక, సమస్త మానవాళికి ఆయన రారాజు.

## తిరస్కరించబడిన వాగ్దానం

యేసు ప్రభువు కాలములో ఆయన మెస్సీయాగా అనేకమంది యూదుల చేత ఎందుకు తిరస్కరించబడ్డాడు? ఒకవేళ ఆయన్ను గురించి చెప్పబడిన ప్రవచనములన్నియు సత్యమే అయితే, ఆయన వాటినన్నిటిని నెరవేర్చినట్లయితే, మరి వారు ఆయన్ను ఎందుకు గుర్తించలేదు?

ఎందుకంటే, *మెస్సీయాను గురించి ఎన్నో శతాబ్దాల నుండి వస్తున్న ఉన్నత ఆశలకు అనుగుణంగా ఆయన ఉండలేదు. మెస్సీయా ఎలా ఉంటాడు, ఏం చేస్తాడు అన్న విషయాలపై ప్రజలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి.* "మెస్సీయా పనులను" చేయలేకపోయిన వారిని ప్రజలు ప్రక్కన పెట్టి మెస్సీయా పనులను చేయగలిగే మరొకరిని ప్రజలు నిరీక్షించేవారు.

యేసు ప్రభువు జీవించియున్న కాలములోని మొదటి శతాబ్దపు ప్రజలు మెస్సీయా అంటే, క్రీ.పూ. 63నుండి పాలస్తీనాను దురాక్రమణచేసి తమను పాలిస్తున్న రోమీయులను ఓడించి ఇశ్రాయేలునకు పూర్వ వైభవం తెచ్చేవాడు అని వారు భావించేవారు. అతడు యుద్ధవీరుడైన రాజుగా (దావీదువలె) నుండి ఒక సైన్యమును సమకూర్చి తమ శత్రువుల నందరిని ఓడించుతాడన్నది వారి ప్రగాఢ విశ్వాసం. ఇందుకు విరుద్ధముగా యేసు తమ శత్రువులను ప్రేమించుమని, సమాధానముగా ఉండుమని బోధించాడు. ప్రపంచపు గొప్ప సామ్రాజ్యమైనను విరుద్ధముగా తిరుగుబాటు నాయకునితో ఉండకూడని ప్రథమ లక్షణ మిది.

తరువాతదిగా యేసుని మరణములోను మరో సమస్య ఉంది. మెస్సీయా ఇశ్రాయేలీయుల చేతిలో, రోమా సిలువలో అమానుషంగా, కౄరంగా, చంపబడుటయు యూదులు అంగీకరించలేకపోయారు. యేసు మొదట్లో గలిలయ ప్రాంతములలో పరిచర్య ఆరంభించినప్పుడు అనేకమంది ఆయనను అనుసరించారు. కానీ, తరువాత మెస్సీయాగా ఆయన పని సిలువనెత్తుకోవడమేగాని రోమీయులమీద విజయం సాధించడంకాదని గ్రహించిన తరువాత ఆయన్ను ఒంటరిగా వదిలివేయసాగారు.

యేసు ప్రభువునకు సన్నిహితముగా ఉన్నవారికి కూడా ఇది కష్టంగా అన్పించింది. దేవుని చేత పంపబడిన అభిషిక్తునిగా యేసును గుర్తించిన మొదటివాడైన బాప్తిస్మమిచ్చు యోహానునకు కూడా ఇది కష్టంగా అన్పించింది (మత్తయి 3:13-15; యోహాను 1:19-34; 3:25-30). తరువాత కాలంలో, తాము నిరీక్షిస్తున్న వ్యక్తి ఈయనేనా లేక మరొకరి కోసం తను తన అనుచరులు నిరీక్షించవలెనా అని సందేహపడ్డాడు (మత్తయి 11:2-6).

మెస్సీయా ఇశ్రాయేలును పునరుద్ధరించే పనిని ప్రారంభించాడన్న వార్తను వినాలని హేరోదు చెరలోనున్న యోహాను ఆశించారు కానీ ఏ సైన్యపు కార్యం కార్యరూపు దాల్చలేదు. కానీ, మెస్సీయాను గురించి చెప్పిన విషయాలు జరగుతున్నాయని ప్రభువు చెప్పారు.

యేసు ప్రభువులోని మెస్సీయాతనమును గుర్తించడం ఆయన శిష్యులకే కష్టమైంది. యాకోబు యోహానులు తాము ప్రభుని కుడివైపు ఒకరు ఎడమవైపు ఒకరు ఉండుటకు అనుమతివ్వమని అడిగినప్పుడు వారు తప్పనిసరిగా ఆయన సైన్యపాలన గురించే యోచించివుంటారు (మార్కు 10:35–40; మత్తయి 20:20–23), మరో మాటలో చెప్పాలంటే వారు ప్రఖ్యాతి అధికారులవ్వాలనుకున్నారు. ప్రభుని పునరుత్థానం తరువాత, "ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?" అని శిష్యులు అడిగినట్లు అపొస్తలుల కార్యములు 1:6లో చూస్తున్నాము. ప్రభుని కాలంలోని అనేకమంది యూదులు ఆయన మెస్సీయా తనమును గ్రహించలేక, ఆయనను దేవుని నుండి వచ్చినవానిగా "గుర్తించలేకపోవడం" ఇది ఆశ్చర్యకరంగానే ఉంటుంది. ఆయన కనపరచిన మహత్కార్యములు ఆయన మెస్సీయా అని గుర్తిస్తుండగా వారు మాత్రం ఆయనను గుర్తించకపోవడం వారి తప్పు (యోహాను 10:22–30).

యేసు క్రీస్తును అనేకమంది మెస్సీయాగా అంగీకరించకపోవడానికి గల మరో కారణమేమంటే, ఆయన నిజానికి "దావీదు కుమారుని" *కంటె అధికుడు.* మత్తయి 22:41–46లో ఆయన ఇదే విషయాన్ని పరిసయ్యులతో చర్చించాడు (ఆయనకు విరోధులైనవారు) "క్రీస్తునుగూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడు?" అని వారిని ప్రశ్నించాడు. "దావీదు కుమారుడని" వారు సమాధానమిచ్చారు. అందుకాయన దావీదు మెస్సీయాను కీర్తన 110:1లో "నా ప్రభువు" అని సంబోధించాడని, అలాంటప్పుడు మెస్సీయా దావీదు కుమారుడు ఎలా అవుతాడని ప్రశ్నించాడు. అందుకు వారినుండి సమాధానం లేదు. మెస్సీయాగా ఆయన దావీదు వారసత్వమును కాదనుటలేదు గాని, ఆయన దావీదు కంటే అధికుడు కాబట్టి ఈ బిరుదు లేదా నామం తగినదని ఆయన చెప్తున్నాడు. ఈ విషయాన్ని దేవుడు దావీదునకు ముందే చెప్పాడు. వాగ్దానం చేయబడిన "కుమారుడు" ఇశ్రాయేలు సింహాసనం మీద కూర్చుండువాడు "దేవునికి కుమారుడై" యుంటాడని వాగ్దానం చేశాడు (1 దినవృత్తాంతములు 17:13; 22:10). యేసు దావీదు కుమారుడు మాత్రమే కాదుగాని, అతడు దేవుని కుమారుడు కూడాను. ఈ లోక రాజ్య అధికారమే గాకుండ ఆయన పరిచర్య దీనికి అతీతమైనది. కానీ దురదృష్టవశాత్తు యూదులు కేవలం ఆయన ఈ లోక ఆధిపత్యమునే కోరుకున్నారు.

దేవుడు దావీదునకు చేసిన వాగ్దానం సమీప భవిష్యత్తునకు మరియు కొద్దికాలం తరువాత నెరవేరబోయే వాగ్దానమును సూచిస్తుంది. అతడు సింహాసనం పై కూర్చుంటాడు. అతడు కేవలం దావీదు కుమారుడు గాకుండా, దేవునికి కూడా కుమారుడైయుంటాడు. రాజైన సొలొమోను తన తండ్రి సింహాసనమును అధిష్టించి, మొదటి వాగ్దానమును నెరవేర్చాడు. క్రీస్తు అయిన యేసు దావీదు సింహాసనం మీద కూర్చుండి తుది వాగ్దానమును నెరవేర్చాడు.

### ప్రస్తుత కాలమునకు వాగ్దానం

2 సమూయేలు 7:5–16లో దేవుడు దావీదుతో ప్రత్యేకంగా మాట్లాడినా గాని, చరిత్రలో

ఆనాటి వాగ్దానం ఇప్పటికీ మనకు నిలిచేయుంది:

*మొదటిగా, దేవుని వాగ్దానముల నెరవేర్పు మానవుల పరిపూర్ణతపై ఆధారపడి యుండదు.* దేవుడు దావీదునకు ఇచ్చిన వాగ్దానం షరతులు లేనిది, తరువాత కాలంలో దావీదు కొన్ని పాపములు చేసినను, దేవుడు తన వాగ్దానమును నిలిపేయుంచాడు. మన అపరాధములు, ఇతర పాపములను చూచినప్పుడు మనం కృంగిపోతుంటాము కానీ అలా కృంగిపోకూడదు. దేవుడు ప్రతివాగ్దానమును నెరవేర్చుతాడు. యేసు ప్రభువు ఇప్పటికీ సింహాసనాసీనుడైయున్నాడు. తన ప్రజలకొరకు రక్షణ ఇప్పటికీ ఉంది.

*రెండవదిగా, దేవుడు తన వాగ్దానములను నెరవేర్చుతాడు, అది ఎంతకాలం తీసుకున్నప్పటికి, అవి నెరవేరుతాయి.* దావీదు కాలంనుండి యేసు ప్రభుని కాలమునకు వేయి సంవత్సరాలు గడిచినను, మెస్సీయాను గూర్చిన వాగ్దానం నెరవేర్చబడింది. అలాగే క్రీస్తు మరలా వస్తానన్న వాగ్దానం ఇచ్చి రెండువేల సంవత్సరాలు దాటినా, ఆయన వస్తాడని వాక్యం స్పష్టంగా చెప్తుంది. దేవుడు మన కాలము ప్రకారం నడుచుకోవడం లేదని మనం కృంగిపోకూడదు. ఆయన వాగ్దానాలు నెరవేరునట్లు మనం విశ్వాసముతో నిరీక్షించాలి. మనమాయనయందు విశ్వాసముంచి, వెనుదిరగనట్లయితే, మనం తప్పనిసరిగా ఆశీర్వదించబడతాము.

*మూడవదిగా, యేసును గురించిన అల్ప విశ్వాసం పట్ల మనం జాగ్రత్తగానుండాలి.* యేసును బర్తిమయి "దావీదు కుమారుడు" అని పిలువడం సబబే కానీ అతనికి పూర్తి సత్యం తెలియదు. ఈనాడు యేసు క్రీస్తును కూడా అనేకమంది ఒక గొప్ప వ్యక్తిగా, ఒక ప్రవక్తగా లేదా "ఒక" దేవుడిగా గుర్తిస్తున్నారే గాని ఆయనే "అసలు" రక్షకుడు ఆయనే అని గుర్తించుట లేదు. యేసును క్రీస్తుగా/మెస్సీయాగా లేదా దేవుని కుమారునిగా గుర్తించుటలో అసంపూర్ణత యున్నట్లయితే అది సమ్మతి కానేకాదు.

నాలుగవదిగా, మనం దేవుని కొరకు చేస్తున్న పని ఆయన మనకొరకుచేస్తున్న పనితో పోల్చితే శూన్యము. దావీదు దేవుని కొరకు మందిరము నిర్మించాలనుకున్నాడు. అయితే ఆయన మనకు సమస్తము దయచేయువాడని మనమిది ఆయనకు కల్పించనవసరం లేదని ఆయన గుర్తు చేశాడు. దావీదు తాను ఎన్నడూ ఊహించని స్థానంలో తనను దేవుడు నిలువ బెట్టాడు. అలాగే మన ఆత్మీయ ఉన్నతినిబట్టి, మంచి పనులను బట్టి మన జీవితాలు దేవుని దృష్టిలో ఉన్నతముగానున్నాయని అనుకుంటూ మనలను మనమే మోసగించుకుంటున్నాము. నిజానికి, యేసు క్రీస్తు ద్వారా దేవునికి మనం విధేయులమవుటకు పిలువబడ్డాము. కానీ "మా నీతి క్రియలన్నియు మురికి గుడ్డవలె నున్నాయని" (యెషయా 64:6) మనం గుర్తుంచుకోవాలి. గ్రుడ్డివాడైన బర్తిమయివలె మనమూ "కనికరముంచుము దేవా!" అని వేడుకోవాలి. అప్పుడు యేసు ద్వారా ఆయన వాగ్దానములు నెరవేర్చబడతాయి.

## మందిరమును నిర్మించుటకు దావీదు ఎందుకు అర్హుడు కాడు?

మందిరమును నిర్మించుటకు ఎందుకు దేవుడు దావీదును తిరస్కరించాడు అన్న విషయమునకు గల కారణం 2 సమూయేసు 7లో లేదా దాని సమాంతర వాక్యమైన 1 దినవృత్తాంతములు 17లో మనకు కనబడదు. దావీదు నిర్మాణమునకు చూపిన అతి ధైర్యమే కారణం అన్న విషయం తప్ప మరేది మనకు అందులో గోచరించదు. కానీ ఇందుకు

గల కారణం, మనకు 1 రాజులు 5:3లో మరియు 1 దినవృత్తాంతములు 22:8; 28:3లో కనబడుతుంది. దావీదు యుద్ధములను జరిగించి, తద్వారా ఎంతో రక్తమును చిందించడము కారణమని మనకు కనబడుతుంది.

ఇది మందిర నిర్మాణానికి అతడ్ని ఎలా అనర్హుడ్ని చేసింది? రెండు కారణాలు మనకు కనబడుతున్నాయి. మొదటిది 1 రాజులు 5:3లోనున్నది. యుద్ధములు చేయుటయందు దావీదు నిమగ్నుడైయుండుట వలన మందిరము నిర్మించుటకు అతడు తీరికలేకుండగానున్నాడని సొలొమోను చెప్పడం మన మిక్కడ చూస్తున్నాము. కానీ ఇదే ప్రాథమిక కారణముగా తోచడం లేదు. ఎందుకంటే, “యెహోవా నలుదిక్కుల అతని శత్రువులమీద అతనికి విజయమిచ్చి అతనికి నెమ్మది కలుగజేసిన తరువాత” 2 సమూయేలు 7:1 దావీదునకు మందిర నిర్మాణమును గురించిన ఆలోచన పుట్టింది. ఇలాంటిదే మరో కారణం 1 దినవృత్తాంతములు 22:8లో కనబడుతుంది. “నీవు విస్తారముగా రక్తము ఒలికించి గొప్ప యుద్ధములు జరిగించినవాడవు; నీవు నా నామమునకు మందిరమును కట్టించకూడదు. నా సన్నిధిని నీవు విస్తారముగా రక్తము నేలమీదికి ఒడ్చితివి” (చూడు 1 దినవృత్తాంతములు 28:3). మరోమాటలో చెప్పాలంటే, దావీదు విస్తారముగా ఒలికించిన రక్తము ద్వారా అతడు మందిరమును కట్టించుటకు “అపవిత్రుడయ్యాడు” (రక్తము మరియు అపవిత్రతను తొలగించుకునేందుకు మోషే ధర్మశాస్త్రములో ఇయ్యబడిన సూచనల కొరకు లేవీయకాండము 17ను చూడు). అతని కుమారుడైన సొలొమోను పాలనా కాలములో సమాధానము సమృద్ధిగా ఉంది కాబట్టి అతని విషయంలో ఏ సమస్యలేదు (1 రాజులు 5:4). దీనినే సొలొమోను దృఢపరుస్తున్నాడు,

> నీ సింహాసనముమీద నేను నీకు బదులుగా కూర్చుండబెట్టు నీ కుమారుడు నా నామ ఘనతకు ఒక మందిరమును కట్టించునని యెహోవా నా తండ్రియైన దావీదునకు సెలవిచ్చినట్లు నా దేవుడైన యెహోవా నామఘనతకు మందిరమును కట్టించుటకు నేను ఉద్దేశముగలవాడనై యున్నాను (1 రాజులు 5:5).